సమస్యల పరిష్కారానికే 'సురక్ష'

ఎమ్మెల్యే డీఎన్నార్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సరళ



పేరూరు గ్రామసభలో సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: ప్రజలు క్షేత్రస్థాయిలో నిత్యం ఎదుర్కొనే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. మండలంలోని పేరూరులో ఎంపీడీవో పీ మల్లీశ్వరీ ఆధ్వర్యాన జగనన్న సురక్ష పథకంపై గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు ఉచితంగా అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగానే ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను సత్వరమే అందిస్తున్నట్లు చెప్పారు. మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ముఖ్యమంత్రి జగనన్న ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో పలువురు లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం కార్యక్రమానికి గుర్తుగా ఎమ్మెల్యే అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.శ్రీనివాస్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, సర్పంచ్ పుట్టి మాధవీ రాణి, సొసైటీ అధ్యక్షుడు సోమల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు నాయకులు మోట్రు ఏసుబాబు, నాయకులు సీలం రామకృష్ణ, సాక్షి సాయిబాబు, రాచూరి కుమార్, వీర్ల శ్రీనివాసరావు, పరిశె రాజేష్, పెద్దిబోయిన వెంకటేశ్వరరావు, పలు శాఖల అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కైకలూరు: జగనన్న సురక్షతో ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరుతున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరు మండలం వదర్లపాడు, కలిదిండి మండలం కోరుకొల్లు -1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు సోమవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలోనే 99 శాతం పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ భవిష్యత్ తరాలకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల పనితీరును ఇతర రాష్ట్రాల సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. అనంతరం వివిధ రకాల ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. సచివాలయాల వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమాల్లో ఎంపీపీ అడవి కృష్ణ, చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ ఓడుబోయిన నాగలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ఘంటసాల కనకరత్నం, వడపు యేసు, వెంకన్న, చందు, కేడీసీసీ డైరెక్టరు దాసి సరోజినిబాయి, పీఏసీఎస్ అధ్యక్షులు అంకెం నరసయ్య, ఎంపీటీసీ సభ్యులు చన్నంశెట్టి శిరీష, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం..

కోరుకొల్లులో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రారంభించారు. నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సచివాలయ నిర్మాణాలు పూర్తవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మండవల్లి: పాదయాత్రలో ప్రజల సమస్యలు 99 శాతం పరిష్కరించి వారికి అండగా ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలోనే ఒకే ఒక్కడు అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని కొవ్వాడలంకలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే డీఎన్నార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థను రూపొందించి అర్హత ఉండి సంక్షేమ ఫలాలు అందని వారికి అధికారులను జగనన్న సురక్ష కార్యక్రమానికి పంపి లబ్ధిదారులకు అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. రూ.14 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ జయమంగళ తిరుపతి వెంకన్న, ఉప సర్పంచ్ మోరు కృష్ణమోహన్, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షులు బలే నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నిమ్మకూరులో సర్టిఫికెట్ అందజేస్తున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సరళ, ఎంపీపీ అశోక్

నిమ్మకూరు(పామర్రు): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎంతో మందికి లబ్ధి చేకూరుతోందని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సరళ అన్నారు. మండలంలోని నిమ్మకూరు సచివాలయం వద్ద సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అత్యంత అవసరమైన సేవలను నేరుగా అందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంకా పొందని లబ్ధిదారులను గుర్తించి వారికి సకాలంలో పథకాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, మండల ఆర్బీకే చైర్మన్ ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పీ రత్నకుమారి, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఏపీఎం తిరుమతిరావు, ఏపీవో పోలురాజు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ పద్మావతి, తదితరులు

గుడివాడ టౌన్: ప్రజలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ ఫలాలకు అడ్డంకిగా ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించి వాటికి కావలసిన అనుమతి పత్రాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం అని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక కాకర్ల వీధిలోని 18వ వార్డు సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 11 రకాల సమస్యల పరిష్కారానికి ఇక్కడ ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అందుకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను ఇదేరోజు లబ్ధిదారులకు అందజేస్తామని ఆమె తెలిపారు. మొత్తం 328 మంది లబ్ధిదారులకు కావలసిన ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, వార్డు మాజీ కౌన్సిలర్ అల్లం సూర్యప్రభ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, జేసీఎస్ కృష్ణమోహన్, వార్డు ఇన్‌చార్జ్ అల్లం రామ్మోహన్, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక 7వ వార్డు ఎన్టీఆర్ కాలనీ-3వ సచివాలయంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 704 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ దుడ్డు చిన్నా, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శాకంబరేశ్వరీదేవిగా గంగానమ్మ



గుడివాడ టౌన్: స్థానిక మేదర్ బజార్‌లో శ్రీ గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారిని సోమవారం శాకంబరేశ్వరీ దేవిగా అలంకరించారు. అర్చకుడు భైరవభొట్ల భానుకిరణ్ వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటి రాము-శ్రీదేవి దంపతులు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రతి ఏటా అమ్మవారిని శాకంబరేశ్వరీ దేవిగా అలంకరిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

45 మందికి వైద్య పరీక్షలు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో 45 మంది వైద్య సేవలు అందుకున్నారు. డాక్టర్ పీ నిహారిక ఆధ్వర్యంలో బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇళ్లకు వెళ్లి వైద్య బృందం సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ కే దివ్య, ఆరోగ్య కార్యకర్త కే రామాంజనేయులు, డీఈవో కే కోమలి, ఆశావర్కర్‌లు జశాంక, విజయలక్ష్మి, శ్యామలలు సహకరించారు.

స్పందనలో అర్జీ అందజేత

మండవల్లి: పారిశుద్ధ్యం సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఐక్య వేదిక జిల్లా బాధ్యులు ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, బి.రంగారావు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఏట జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రైళ్లు ఢీకొని పశువులు మృతి

కైకలూరు: వేర్వేరు చోట్ల రైళ్లు ఢీకొని రెండు పశువులు మృతి చెందాయి. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కైకలూరు - ఆకివీడు రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం ఉదయం గూడ్సు రైలు, మధ్యాహ్నం పాసింజర్ రైలు నడుస్తున్న సమయంలో కైకలూరు నుంచి పల్లెవాడ మధ్య రైళ్లు ఢీకొనడంతో పశువులు అక్కడికక్కడే మృతి చెందాయి. రైల్వే ట్రాక్‌లపై పశువుల సంచారం నిరోధించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌ల ద్వారా రైతులకు అవగాహన కలిగిస్తామని రైల్వే పోలీసులు చెప్పారు.

ఆక్వా రంగంలో మెలకువలపై అవగాహన

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఆక్వా సాగులో మెలకువలపై రైతులు ముందుగా అవగాహన కలిగి ఉండాలని ప్రావెట్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ సేల్స్ మేనేజర్ కట్టా సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లిలో నేషనల్ ఫిష్ ఫార్మర్స్ డే సందర్భంగా సోమవారం ఆక్వా సాగు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగులో ఎదురయ్యే సమస్యలు, మెలకువలు గురించి వివరించారు. మచిలీపట్నం ఏరియా కో-ఆర్డినేటర్ దేవరకొండ వసంత్, ఆక్వా రైతులు దాసరి శివ, అడపా రాంబాబు, సుంకర నాగేశ్వరావు, రెడ్రౌతు వెంకటేశ్వరావు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వలంటీర్లను కించపరచడం తగదు

వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే



కైలే అనిల్‌కుమార్

పామర్రు: వలంటీర్ల సేవలను కించ పరుస్తూ మాట్లాడిన పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని ప్రతిపక్షాల దురుద్దేశ పూర్వక ప్రయత్నాలను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ తీవ్రంగా ఖండించారు. వలంటీర్లపై తీవ్ర విమర్శలు చేస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందించారు. సోమవారం ఆయన మాట్లాడారు. సేవలకు ప్రతిరూపాలైన వలంటీర్ల ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా నిస్వార్థంగా పని చేస్తున్నారన్నారు. వీరిపై పవన్ కళ్యాణ్ చేసిన నిరాధార ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అనిల్‌కుమార్ అన్నారు. అవిశ్రాంతంగా పని చేస్తూ అవ్వా తాతలకు పెన్షన్ అందించడంతో సహాయం అందిస్తున్నారని అన్నారు. రైతన్నలకు సహాయం చేయడం, తల్లులు, పిల్లలకు అన్ని వేళలా ముందుండి సాయం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు మెరుగైన ప్రయోజనాలతో సేవలను అందించడంలో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సకాలంలో ప్రజలకు అందజేస్తూ, ప్రభుత్వ సేవలను త్వరిత గతిన ప్రజలకు చేరవేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. అంకిత భావంతో అవధులు లేని సేవలను అందిస్తున్నారని, అటువంటి వలంటీర్లపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయాలనే ఉద్దేశంతో పవన్ నిరాధారమైన ఆరోపణలుచేస్తున్నారని పేర్కొన్నారు.

ఇలాంటి నిరాదారమైన చర్యలకు పూనుకోవడం చాలా హేయమైన చర్య అని అన్నారు. వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేసిన పవన్ కళ్యాణ్, ప్రతిపక్షాలు తక్షణమే భేషరతుగా వారికి క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. అరాచకాలు లేకుండా వివక్ష లేకుండా లంచాలు లేకుండా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేస్తున్న వలంటీర్లను అభినందించాలన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభం



తాడినాడలో పైపులైను పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) చెప్పారు. కలిదిండి మండలం తాడినాడలో రూ.26.08 లక్షలు, చినతాడినాడలో రూ.48.43 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న పైపులైన్ పనులను ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి సోమవారం ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ కూసంపూడి కనకదుర్గారాణి, పీఏసీఎస్ అధ్యక్షులు సాగి చిన్నబ్బాయిరాజు, చినతాడినాడ సర్పంచ్ గండికోట ఏసుబాబు, అల్లూరి సూర్యనారాయణరాజు, పెన్మెత్స రామకృష్ణరాజు, పెన్మెత్స ఉప సర్పంచ్ యాళ్ల స్టీఫెన్సన్, యాళ్ల రత్నరాజు, పత్తి ఆనంద్‌రాజు, బందిలా రామరాజు, కాగితాల అభిషేక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



సమస్యలు పరిష్కరించాలని అర్జీ అందజేస్తున్న యూనియన్ సభ్యులు

పామర్రు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులను ఆదుకోవాలని కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం అర్జీ అందజేశారు. మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 1214 మెమోను రద్దు చేసి సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు, కార్డులను వెంటనే విడుదల చేయాలి. 60 ఏళ్లు నిండిన కార్మికులు విధులలో ఉన్నంత కాలం పరిహారాలు కొనసాగాలని అన్నారు. ఎమ్మెల్యే పీఏ అబ్బాస్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు వేము పెదబాబు, జహీరుద్దీన్ ఖాన్, కె.రాజశేఖర్, సీహెచ్ రమేష్, వీ వెంకటేశ్వరరావు, షేక్ అల్లా భక్షు, సీఐటీయూ ఒ గంగాధర ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

- సర్వీసులను తనిఖీ చేసిన 40 బృందాలు
- రూ.4 లక్షల అపరాధ రుసుం వసూలు



తనిఖీలు నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ సురేష్

గుడివాడరూరల్: విద్యుత్ చౌర్యం చట్ట రీత్యా నేరమని, చౌర్యానికి పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం 40 బృందాలుగా అధికారులు ఏర్పడి విద్యుత్ సర్వీస్‌లను తనిఖీ చేశారు. 1898గృహ సర్వీస్‌లు, 178 వాణిజ్య సముదాయాల సర్వీస్‌లు, 175ఆక్వా సర్వీస్‌లను అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో 149 సర్వీస్‌లకు గాను అదనపు విద్యుత్ వినియోగం 192 కేడబ్ల్యూ మొత్తానికి వినియోగించనందుకు సర్వీస్‌లపై రూ.4 లక్షలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం జరిగినట్లు ఎక్కడైనా కన్పిస్తే 94408 12362, 9440812363, 83310 14951 నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా ఆయన కోరారు. ఈ తనిఖీల్లో గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ టి.రామకృష్ణ, గుడివాడటౌన్ డీఈఈ జి.వెంకటేశ్వర్లు, గుడివాడ రూరల్ విద్యుత్ ఏఈ సురేష్‌బాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కుండపోత వర్షం.. రైతుల్లో హర్షం

పెడన: పెడనలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో పాటు రైతుల పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమైనా నాలుగైదు గంటలకు నీరంతా డ్రెయిన్ల ద్వారా బయటకు పోయాయి. మరో పక్క కొంకేపూడి, నడుపూరు, కూడూరు, నందిగామ, పెనుమల్లి, నేలకొండపల్లి, బలిపర్రు, నందమూరు, కాకర్లమూడి తదితర గ్రామాల్లోని పంట చేలలో వర్షం నీరు నిలిచింది. ఇప్పటికే రైతులు తమ పంటల్లో వెదసాగు ద్వారా విత్తనాలు జల్లుకుని సిద్ధంగా ఉన్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే మొలకలు వచ్చాయి. మొలకలు వచ్చిన చోట వర్షం నీరు ఉండటంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా విత్తనాలు జల్లిన చోట నీరు నిల్వలేకుండా చూసుకుంటున్నారు. సోమవారం కురిసిన కుండపోత వర్షం రైతులకు మేలు చేసిందని అంటున్నారు.

పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలి



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వలంటీర్లు

గుడివాడ టౌన్: మహిళా వలంటీర్లను కించపరుస్తూ మాట్లాడిన పవన్ కల్యాణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని గుడివాడ వలంటీర్లు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ వరకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించారు. మహిళలపట్ల గౌరవం లేని వ్యక్తి పవన్ కల్యాణ్ అని, అతని పూర్తి స్వభావాన్ని బయటపెట్టేలా పవన్ కల్యాన్ వ్యాఖ్యలు ఉన్నాయని వారు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అనేక సేవలు చేస్తూ వారి మన్ననలు పొందుతున్న వలంటీర్లను చులకన చేస్తూ బ్రోకర్‌లు అంటూ మాట్లాడటం అతని అహంకారానికి నిదర్శనం అన్నారు. వెంటనే పవన్ కల్యాణ్‌పై మహిళా కమిషన్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, ఎంవీ నారాయణరెడ్డి, మెరుగుమాల కాళీ, దుడ్డు చిన్నా, నీలాకాంత్, కృష్ణమోహన్, మణికంఠ, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విజిలెన్స్ అధికారి



పామర్రు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను మినిస్టరీ ఆఫ్ సెంట్రల్ విజిలెన్స్ అధికారి కృష్ణంరాజు సోమవారం సందర్శించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో ఆయన నేర పరిస్థితులపై సమీక్షించారు. ప్రస్తుతం క్రైం రేట్ తక్కువగా ఉన్న విషయాన్ని గమనించారు. మరింత తక్కువగా ఉండేలా కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నిందితులను త్వరిత గతిన గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినూత్న విధానాన్ని అందిపుచ్చుకుని శాంతి భద్రతలను కాపాడాలన్నారు.

వార్డు అడ్మిన్‌కు సత్కారం



నాగమణిని సత్కరిస్తున్న ఆర్డీఓ, తదితరులు

గుడివాడ టౌన్: ప్రభుత్వ అధికారులు ఏ ప్రాంతంలో అయినా విధి నిర్వాహణ ఒకే రీతిలో ఉండాలని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక 18వ వార్డు నుంచి విజయవాడకు బదిలీ అయిన వార్డు అడ్మిన్ పామర్తి నాగమణిని ఆమె సత్కరించారు. గత మూడున్నర సంవత్సరాలుగా వార్డు ప్రజలకు ఉత్తమ సేవలందించినందుకు అమెకు స్థానికులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మాట్లాడుతూ స్థానికుల మన్ననలను పొందిన నాగమణి విజయవాడలో మరిన్ని ఎక్కువ సేవలు చేసి స్థానికుల మన్ననలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అల్లం సూర్యప్రభ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, వార్డు ఇన్‌చార్జ్ అల్లం రామ్మోహనరావు, కృష్ణమోహన్, సచివాలయ ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటా విక్రయాలు ప్రారంభం



సబ్సిడీపై టమాటా విక్రయాలలు ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత

కైకలూరు: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కైకలూరు రైతు బజారులో సబ్సిడీపై టమాటాల విక్రయాలను కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత సోమవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో టమాటా ధర పెరగడంతో ప్రభుత్వం రైతు బజార్లలో కిలో టమాటాను రూ.50కే అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం నుంచి కొనుగోలుదారులు సబ్సిడీ టమాటాల కోసం బారులు తీరారు. కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేటు ఆఫీసరు పి.నందినీ దేవి, వైఎస్సార్ సీపీ నాయకులు దండే రవిప్రకాష్, రైతు బజారు సిబ్బంది ప్రదీప్, నాగరాజు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం



స్పందనలో బాధితుల నుంచి అర్జీలు అందుకుంటున్న ఎస్పీ పి.జాషువ

కోనేరుసెంటర్: స్పందనలో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా ఎస్పీ పి.జాషువ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని స్పందన హాల్లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు న్యాయం కోసం ధైర్యంగా స్పందనను ఆశ్రయించవచ్చని చెప్పారు. అర్జీ అందుకున్న అనతి సమయంలోనే బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

అందిన అర్జీలు....

- గుడ్లవల్లేరుకు చెందిన రాజులపాటి విజయలక్ష్మి తన చిన్న కుమారుడు తాపీ పని చేస్తుంటాడని, గుమ్మడి స్వాతి అనే ఆమె తాపీ పనులు చేస్తుంటుందని తెలిపింది. స్వాతి తన కుమారుడి ఫోన్‌పేకు ఆమె బంధువులు నగదు పంపినట్లు చెప్పగా తన కుమారుడి ఫోన్‌పేకు ఎటువంటి నగదు జమ కాలేదని చెప్పింది. అయినప్పటికీ స్వాతి డబ్బులు ఇవ్వకుంటే అందరిలో పెట్టి తమ పరువు తీస్తానంటూ బెదిరిస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలు తీసుకుని తమ పరువును కాపాడాలని కోరింది.
- మచిలీపట్నం గాంధీనగర్‌కు చెందిన శ్రావణం కుసుమకుమారి తనకు ఇద్దరు మగపిల్లలు కాగా చిన్న కుమారుడి వద్ద ఉంటున్నట్లు చెప్పింది. కొడుకు, కోడలు తన ఆస్తికి సంబంధించిన దస్తావేజులు బలవంతంగా తీసుకుని తనను మానసికంగా, శారీరకంగా బాధపెడుతున్నారంటూ వాపోయింది. తన డబ్బు తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోవాలంటూ వేధిస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని తనకు రక్షణ కల్పించాలని ఫిర్యాదులో కోరింది.
- మచిలీపట్నం ఈడేపల్లికి చెందిన పోసిన నాగభవాని స్పందనలో ఎస్పీని కలిసి 2020లో కొట్టి మహేష్ అనే అతనిని ప్రేమ వివాహం చేసుకున్నట్లు చెప్పింది. పెద్దలు ఒప్పందం కుదిర్చి అత్తింటికి పంపినట్లు తెలిపింది. కట్నకానుకల కింద రూ.ఐదు లక్షలు, బంగారం పుట్టింటి వాళ్లు అందజేయగా భర్త, అత్తామామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, కులం పేరుతో దూషిస్తున్నారని, న్యాయం చేయాలని కోరింది. బాధితుల అర్జీలపై స్పందించిన ఎస్పీ సంబంధిత అధికారులకు వాటిని సిఫార్సు చేశారు. ఏఎస్పీ ఆర్.హరిబాబు పాల్గొన్నారు.